APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ గురువారం 20 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :85 పేజీలు : 04 వెల: 2-00/-

## రష్యా డ్రోన్ దాడిలో విద్యార్థి గాయం

- ఉఫాలో భారత విద్యార్థికి గాయాలు
- చికిత్స అందిస్తున్న స్థానిక వైద్యులు
- సహాయ చర్యల్లో భారత రాయబార కార్యాలయం
- యుద్ధ ప్రభావంపై ఆందోళన వ్యక్తం

మాస్కో, ఆగస్టు 19 : రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో రష్యాలోని ఉఫా నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఓ భారతీయ విద్యార్థి గాయపడిన ఘటన ఆందోళన కలిగించింది. బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ఆ విద్యార్థి దాడిలో గాయపడగా, వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే భారత రాయబార కార్యాలయం స్పందించింది. గాయపడిన విద్యార్థితో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నామని, అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తున్నామని అధికారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలు, వైద్య అధికారులతో సమన్వయం చేస్తూ



పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి భద్రతను దృష్టిలో ఉంచుకుని అతని వ్యక్తిగత వివరాలను బయటపెట్టడం లేదని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న భారతీయ విద్యార్థులు, పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది. అవసరమైతే రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా విజ్ఞప్తి చేసింది. ఇటీవల మూడు రోజులుగా రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు మరింత తీవ్రతరం అయ్యాయి. ముఖ్యంగా పారిశ్రామిక కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలు లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రష్యాలోని పలు నగరాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. మాస్కోకు సుమారు 1,200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉఫా నగరం ఇటీవల దాడుల కారణంగా వార్తల్లో నిలుస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చమురు శుద్ధి కేంద్రాలు, పారిశ్రామిక యూనిట్లు ఈ ప్రాంతంలో ఉండటంతో ఉఫా వ్యూహాత్మకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అక్కడి కీలక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు కొనసాగుతున్నట్లు సమాచారం. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల భద్రత అంశం తరచూ చర్చనీయాంశంగా మారుతోంది. ప్రస్తుతం గాయపడిన విద్యార్థి కోలుకుంటున్నాడని అధికారులు వెల్లడించడంతో కుటుంబ సభ్యులు కొంత ఊరట వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న భారత ప్రభుత్వం, అవసరమైతే మరిన్ని సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాయబార కార్యాలయం తెలిపింది.



## నీట్ సంస్కరణలపై సుప్రీం దృష్టి


న్యూఢిల్లీ, ఆగస్టు 19 : నీట్ పరీక్షల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షల విధానంలో సంస్కరణలు కేవలం నివేదికలు, సిఫార్సులకే పరిమితం కాకుండా శాశ్వత వ్యవస్థగా అమలు కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. రాధాకృష్ణన్ కమిటీ, నందన్ నీలేకని కమిటీలు సూచించిన సంస్కరణల అమలుపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల పూర్తి వివరాలను సమర్పించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను ఆదేశించింది. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తరపున దాఖలైన పిటిషన్‌ను కూడా కోర్టు పరిశీలించింది. పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగత మార్పులు అవసరమని, ఒకసారి సంస్కరణలు ప్రకటించడం సరిపోదని, వాటి అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ధర్మాసనం పేర్కొంది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నీట్ ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల చేతికి చేరే వరకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ అమల్లో ఉందని ఆయన కోర్టుకు వివరించారు. ప్రశ్నపత్రం రూపకల్పనలో అనేక స్థాయిల్లో గోప్యత పాటిస్తున్నామని, ప్రశ్నల ఎంపిక ప్రక్రియను అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రశ్నపత్రాల రవాణాలో కూడా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రశ్నపత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చినట్లు, వాహనం కదలికలన్నీ నిరంతరం పర్యవేక్షణలో ఉంటాయని కోర్టుకు తెలియజేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న భద్రతా వ్యవస్థను ఛేదించడం చాలా కష్టమని కేంద్రం పేర్కొంది. నీట్ పేపర్ లీక్ ఘటనల అనంతరం కేంద్ర విద్యాశాఖ ఏడుగురు సభ్యులతో రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షల నిర్వహణ, డేటా భద్రత, ఎన్‌టీఏ నిర్మాణం, విధి నిర్వహణలో సంస్కరణలపై ఈ కమిటీ పలు కీలక సిఫార్సులు చేసింది. అదే సమయంలో మరింత విస్తృత స్థాయి మార్పుల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో మరో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. విచారణ అనంతరం పిటిషనర్ల తరపు న్యాయవాది తన్వీ దూబే స్పందిస్తూ, రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులు ఉన్నప్పటికీ గతంలో చోటుచేసుకున్న లోపాలు ఎందుకు పునరావృతమయ్యాయనే అంశంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు నొక్కిచెప్పిందని తెలిపారు.

## అనూష రాజకీయ అరంగేట్రం ఖాయం



అమరావతి, ఆగస్టు 19 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూషను పోటీకి దింపుతున్నట్లు వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల బరిలో ఆమెను నిలబెడుతున్నామని స్పష్టం చేస్తూ, ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని బొత్స పేర్కొన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో అనూష కూడా ప్రజా జీవితంలో చురుకైన పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారని వివరించారు. అదే సమయంలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తీరుపై కూటమి ప్రభుత్వాన్ని బొత్స సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. శాసనసభలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై సమాధానాలు చెప్పాల్సిన ప్రభుత్వం సభా సంప్రదాయాలను పక్కనబెట్టి వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. డీఎస్సీ వ్యవహారంలో వెలుగుచూస్తున్న అంశాలపై సమగ్ర దర్యాప్తు అవసరమని బొత్స అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాలను ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూడకూడదని అన్నారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా అధికార పక్షం వ్యవహరించిన తీరు సభా సంప్రదాయాలకు విరుద్ధమని బొత్స విమర్శించారు. ఎన్నిక జరుగుతున్న సమయంలో అధికార పార్టీ సభ్యులు సభ నుంచి బయటకు వెళ్లడం రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఒక కొత్త పరిణామమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అధికార పక్షంపైనే ఎక్కువగా ఉంటుందని గుర్తుచేశారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో వ్యవహరించకూడదని బొత్స సత్యనారాయణ సూచించారు. ప్రజల సమస్యలపై చర్చలు జరిపి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని, ప్రతిపక్షాల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

## గత ప్రభుత్వంపై చంద్రబాబు ఆరోపణలు



- మూల్యాంకనంలో తీవ్ర అక్రమాల వెల్లడి
- బాధ్యులపై కఠిన చర్యల హెచ్చరిక

అమరావతి, ఆగస్టు 19 : గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామక ప్రక్రియలో భారీ స్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా దెబ్బతిందని, జవాబు పత్రాల మూల్యాంకనాన్ని అర్హతలేని వ్యక్తులతో నిర్వహించారని విమర్శించారు. శాసనసభలో నిబంధన 344 కింద జరిగిన చర్చలో ఈ అంశంపై సవివరంగా మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకున్న అత్యంత తీవ్రమైన కుంభకోణమని పేర్కొన్నారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించిన పరీక్షల మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకుండా తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి ప్రైవేటు వ్యక్తులకు జవాబు పత్రాల పరిశీలన బాధ్యతలు అప్పగించారని తెలిపారు. అప్పటి ఏపీపీఎస్సీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన అధికారుల నిర్ణయాల వల్ల వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందన్నారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు ఈ-మెయిల్స్, గూగుల్ డ్రైవ్, సందేశ మాధ్యమాల ద్వారా పంపడం ద్వారా గోప్యతను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. మూల్యాంకన ప్రక్రియలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు వంటి అర్హతలేని వ్యక్తులను వినియోగించారని ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐడీ స్వాధీనంలో ఉన్న ప్రాంగణంలో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం నిర్వహించారని పేర్కొన్నారు. ఇందుకోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని, మొత్తం ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని విమర్శించారు. ఫోరెన్సిక్ నివేదికల్లో అనేక సంచలన అంశాలు వెలుగుచూశాయని చంద్రబాబు తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగినట్లు తేలిందన్నారు. కొన్ని చోట్ల వైట్‌నర్ వినియోగించిన ఆనవాళ్లు కూడా గుర్తించారని చెప్పారు. జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్‌రైటింగ్‌లు కనిపించాయని, కొన్నింటిపై సంతకాలు కూడా లేవని వివరించారు. వేల సంఖ్యలో డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ముద్రించబడినట్లు దర్యాప్తులో బయటపడిందన్నారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలను నిలిపివేయడం, మొబైల్ ఫోన్ల వినియోగానికి అనుమతి ఇవ్వడం వంటి అంశాలు అక్రమాలకు అవకాశం కల్పించాయని ముఖ్యమంత్రి ఆరోపించారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకన ప్రక్రియలో ఎగ్జామినర్‌గా నియమించడం వ్యవస్థ పతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కొత్త చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించి మాన్యువల్ మూల్యాంకనానికి ఆదేశించిన తర్వాతే ఈ అక్రమాలన్నీ వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. యువత భవిష్యత్తుతో ఆడుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో పటిష్టమైన, పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు, మేధావుల అభిప్రాయాలను స్వీకరించి నియామక వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## మండలి డిప్యూటీ చైర్మన్‌గా మాధవరావు

అమరావతి, ఆగస్టు 19 : ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలిలో వైఎస్సార్‌సీపీకి సభ్యుల సంఖ్య అధికంగా ఉండటంతో అధికార కూటమి తరపున ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో మాధవరావు ఏకైక అభ్యర్థిగా నిలిచి ఎన్నికైనట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు అధికారికంగా ప్రకటించారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం మండలి చైర్మన్ మోషేన్ రాజు మాధవరావును అభినందించారు. అనంతరం ఆయన్ను డిప్యూటీ చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. సభలోని పలువురు సభ్యులు మాధవరావుకు అభినందనలు తెలియజేస్తూ కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మండలిలో ప్రస్తుతం టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యుల కంటే వైఎస్సార్‌సీపీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికలో కీలకంగా మారింది. ఈ పరిస్థితుల్లో కూటమి తరపున ప్రత్యర్థి అభ్యర్థిని బరిలోకి దించకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. దీంతో వైఎస్సార్‌సీపీకి మండలిలో మరో కీలక పదవి దక్కినట్లైంది.



అయితే డిప్యూటీ చైర్మన్‌ను అభినందించే కార్యక్రమం సందర్భంగా రాజకీయ వివాదం చోటుచేసుకుంది. మాధవరావును చైర్మన్ సీటు వద్దకు తీసుకువెళ్లే సమయంలో కూటమి సభ్యులు అక్కడికి రాకపోవడంపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఈ అంశాన్ని సభలో ప్రస్తావించారు.

# టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం...

## ఇది మరోసారి నిరూపితమైంది

అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య : తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని.. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇది మరోసారి నిరూపితం చేసిందని.. అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు, బీసీ విభాగం నేతలు అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం చొప్పున బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంపై వారు సంబరాలు చేసుకున్నారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు వారు టవర్ క్లాక్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన పాలాభిషేకం చేశారు. బీసీలంతా ముక్తకంఠంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎప్పటికీ చరిత్రలో ఉంటుందన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి లోకేష్ కు



ధన్యవాదాలు తెలిపారు. బీసీలు అన్నింటా ప్రాధాన్యత ఇవ్వాలని ఆ రోజు పరితపించారని.. ఎంతో మంది బీసీలను చట్టసభలకు పంపారన్నారు. అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబుకు బీసీలకు మొట్టమొదటిసారిగా 1995లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ నాయకుడు 2019లో బీసీ రిజర్వేషన్లలో కోత పెట్టి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16 వేల మందికి పైగా బీసీలు పదవులకు దూరమయ్యారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనే బీసీలకు 34 శాతాన్ని మళ్లీ అమలు చేసామని చెప్పడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ బీసీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారన్నారు. తాజాగా గవర్నర్ కోటాలో ఇద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తే.. ఇందులో ఒక బీసీ మహిళ అందునా వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన మహిళకు అవకాశం కల్పించారన్నారు. అది కూడా ఒక సామాన్య కార్యకర్తగా ఉన్న మహిళకు అవకాశం కల్పించారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అర్బన్ నియోజకవర్గ నేతలంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, రంగా, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, పోతుల లక్ష్మీనరసింహులు, బొమ్మినేని శివ, టిడిపి నాయకులు రంగా, మారుతి కుమార్ గౌడ్, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ సంక్షేమ పథకాలు బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



పోరుమామిళ్ల ఆగష్టు 19: (అనంత సూర్య దినపత్రికప్రతినిధి )అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ ఎస్టీ మంత్రులు ఎమ్మెల్యేలు గళం విప్పాలి. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ముత్యాల ప్రసాదు రావు పోరుమామిళ్ల ఆగస్టు 17 రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీల సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రంగాల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంలో పాటు ఏండ్లుగా పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం సమాన అవకాశాల స్ఫూర్తికి అనుగుణంగా ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను చేపట్టాలని ఆయన కోరారు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు ఎస్సీ ఎస్టీ మంత్రులు ఎమ్మెల్యేలు తమ వర్గ సమస్యలను బలంగా ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు,

# పారిశుధ్యం పనుల పరిరక్షణలో కమిషనర్ జస్వంత్ రావు..

అనంత సూర్య, 19 అనంతపురం: నగరపాలక సంస్థ లికమిషనర్ జస్వంత రావు రోజువారీ పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం కొవ్వూరు నగర్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నగరంలోని పబ్లిక్ హెల్త్ వర్కర్లు అందరూ తప్పనిసరిగా ఆప్రాన్ ధరించి విధులకు హాజరు



కావాలని కమిషనర్ ఆదేశించారు. ఆప్రాన్ ధరించడం ద్వారా పబ్లిక్ హెల్త్ వర్కర్లు పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్నారని ప్రజలకు స్పష్టంగా తెలియడమే కాకుండా, విధి నిర్వహణలో వారి భద్రతకు కూడా ఇది ఉపయోగపడుతుందని కమిషనర్ తెలిపారు. పబ్లిక్ హెల్త్ వర్కర్లు తప్పనిసరిగా ఆప్రాన్ ధరించి మాత్రమే విధులకు హాజరయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు మరియు మేస్త్రీలను కమిషనర్ ఆదేశించారు. అనంతరం బళ్లారి రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించి, అక్కడ అందిస్తున్న అల్పాహారం నాణ్యత, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.

# చిన్న పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య : ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల నుంచి మధ్యతరహా, చిన్న పత్రికల పరిరక్షణ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాయలసీమ జిల్లాలు ఇన్చార్జి జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం అనంతపురం నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా, చిన్న దినపత్రికలు అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నూతన కమిటీలను ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం డీఎస్పీ చంద్రశేఖర్ హాజరై ఆంధ్రప్రదేశ్ మీడియం స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్ ఛార్జి కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ.. చిన్న, మధ్యతరహా పత్రికల పరిరక్షణకు, అలాగే అందులో పని చేస్తున్న జర్నలిస్టుల హక్కుల కోసం పని చేసామని చెప్పారు. మరోవైపు నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మధ్యతరహా, చిన్న, ఇతర



పత్రికలకు ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలలో 30 శాతం వాటా ఉండేలా చూడాలన్నారు. పత్రికల ఎం పానల్మెంట్ సమస్యలు, ప్రభుత్వానికి సంబంధించిన వార్తల కవరేజీకి సంబంధించి మధ్యతరహా చిన్న పత్రికలకు తప్పనిసరిగా తగు ప్రతినిధ్యం కల్పించాలని కోరారు. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించే దిశగా పని చేస్తామని స్పష్టం చేశారు.

**అనంతపురం జిల్లా నూతన కమిటీ ఇదే.**

గౌరవాధ్యక్షులుగా శంకర ప్రసాద్ (తెలుగోడు), జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ (ధర్మ విజేత), ఉపాధ్యక్షుడిగా లోకేష్ (అనంత కోకిల), రామాంజినేయులు (మనం), జోడు రమేష్ (కదిలించే వార్త), ప్రధాన కార్యదర్శిగా కే. శ్రీరాములు (నారి – భేరి), సహాయ కార్యదర్శులుగా ప్రసాద్ (బహుజన వేదిక), నాగేంద్ర (అనంత కళా వేదిక), శరత్ కుమార్ రెడ్డి (అక్షర ప్రభ), కోశాధికారిగా జీ.ఆనంద్ (అక్షయ న్యూస్), కార్యవర్గ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు సుబ్బయ్య (ప్రజాబాట), సంజీవ రెడ్డి (సాయంకాలం), భూపాలం సతీష్ కుమార్ (వినియోగ దర్శిని), భాస్కర్ (జన సూర్య), కుంచపు భాస్కర్ (మనం), నరసింహ మూర్తి (నలివేటి ఎక్స్‌ప్రెస్), హరికృష్ణ (అనంత సూర్య ), బాలరాజు (జన సూర్య), రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సిరిసాల సురేష్ (నేషలిస్ట్ హాబ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**శ్రీ సత్య సాయి జిల్లా నూతన కమిటీ ఇదే..**

జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎన్. నారాయణ (రాయల్ న్యూస్ పక్షపత్రిక, హిందూపురం), జిల్లా అధ్యక్షులుగా బి. రవీంద్రనాయక్ ( వాయిస్ ఆఫ్ విక్టరీ ఎడిటర్, కదిరి ), జిల్లా ప్రధాన కార్యదర్శిగా కే.ఎన్. నాగరాజు (పల్లె జీవనం మాసపత్రిక ఎడిటర్ మడకశిర), జిల్లా ఉపాధ్యక్షులుగా సాకే శ్రీనివాసులు (ఎడిటర్ జనతరంగం డైలీ ధర్మవరం), కోలా బ్రహ్మయ్య (సంధ్యవేళ సాయంకాలం ఎడిటర్, కదిరి), జాయింట్ సెక్రెటరీగా పి. మల్లిక (జాబిలి మాసపత్రిక ఎడిటర్, పెనుగొండ), కోశాధికారిగా పి. మహబూబ్ బాషా (ఆంధ్ర ప్రతి దినపత్రిక సబ్ ఎడిటర్, కదిరి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షులు తలారి రామాంజనేయులు, జిల్లా నాయకులు డాక్టర్ సూర్య, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, సుబ్బయ్య, శంకరప్రసాద్, బాబ్జాన్, సురేష్, శ్రీరాములు, ఓ. భాస్కర్, డాక్టర్ ఉద్దండం చంద్ర శేఖర్, రామ్మూర్తి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రహదారికి రూ.3.35 కోట్ల నిధులు

ఉరవకొండ : ఆగస్టు 19 (అనంత సూర్య) : ఉరవకొండ--రాయంపల్లి



రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.35 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. సుమారు 20 ఏళ్లుగా రహదారి కోసం ఎదురుచూస్తున్న ప్రజల సమస్యకు పరిష్కారం చూపుతూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెన్నహోబిలం ఆలయ చైర్మన్ రేగాటి నాగరాజు చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే రూ.3 కోట్లతో 5 కిలోమీటర్ల మేర రహదారి పనులు పూర్తికాగా, తాజాగా మంజూరైన రూ.3.35 కోట్లతో మరో 5 కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రహదారి పూర్తయితే ఉరవకొండ, రాయంపల్లి, నెరిమెట్ల, వ్యాసాపురం తదితర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. రహదారి నిర్మాణంతో ఈ ప్రాంత గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బ్రహ్మం చౌదరిని తన నివాసానికి వెళ్లి పరామర్శించిన

## ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎమ్.ఎస్.రాజు

అనంత సూర్య:19: అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్.ఎస్.రాజు పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్న అయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఎమ్మెల్యేలు బ్రహ్మం చౌదరి ఇంటికి వెళ్లారు. ఆయన్ని పరామర్శించి.. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగా ఉందని బ్రహ్మం చౌదరి తెలిపారు. మరింత విశ్రాంతి తీసుకుని.. మళ్లీ మీ సేవలు ప్రారంభించాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు వివిధ సమయాల్లో పార్టీ కోసం అనేక సేవలందించిన బ్రహ్మంచౌదరి చిన్న వయసులోనే ఇలా అనారోగ్యానికి గురి కావడం బాధాకరమని ఈసందర్భంగా ఎమ్మెల్యేలు అన్నారు. దేవుని దయ



వలన ఆయన త్వరగా కోలుకున్నారని.. మరికొద్ది రోజుల్లో కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ గా తన సేవల్ని తిరిగి ప్రారంభిస్తారని వారు తెలిపారు...

# పోలీసు కుటుంబాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంత కలెక్టరేట్, ఆగస్టు 19: (అనంత సూర్య) : పదవ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) వరకు చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 109




మంది పోలీసు పిల్లలకు జిల్లా ఎస్పీ పి.జగదీష్ బుధవారం 'ప్రతిభా పురస్కారాలు' అందజేశారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను బహుకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో రాత్రింబవళ్లు విధి నిర్వహణలో బిజీగా ఉండే సిబ్బంది పిల్లలు చదువుల్లో రాణించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో దేశానికి, సమాజానికి మంచి పేరు తేలాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, పలువురు పోలీసు అధికారులు, ఎస్పీ సీసి ఆంజనేయ ప్రసాద్, పలువురు పోలీసు అధికారుల సంఘం అడ్హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , సూర్య కుమార్ , గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ, సరోజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం..ఇది మరోసారి నిరూపితమైంది



అనంత సూర్య, 19: అనంతపురం: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని.. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇది మరోసారి నిరూపితం చేసిందని.. అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు, బీసీ విభాగం నేతలు అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం చొప్పున బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంపై వారు సంబరాలు చేసుకున్నారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు వారు టవర్ క్లాక్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన పాలాభిషేకం చేశారు. బీసీలంతా ముక్తకంఠంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎప్పటికీ చరిత్రలో ఉంటుందన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. మంత్రి లోకేష్. ధన్యవాదాలు తెలినారు. బీసీలు అన్నింటా ప్రాధాన్యత ఇవ్వాలని ఆ రోజు పరితపించారని.. ఎంతో మంది బీసీలను చట్టసభలకు పంపారన్నారు. అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు గారికి బీసీలకు మొట్టమొదటిసారిగా 1995లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ నాయకుడు 2019లో బీసీ రిజర్వేషన్లలో కోత పెట్టి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16వేల మందికి పైగా బీసీలు పదవులకు దూరమయ్యారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనే బీసీలకు 34శాతాన్ని మళ్లీ అమలు చేసామని చెప్పడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబు గారి అధికారంలో ఉన్న ప్రతిసారీ బీసీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారని అన్నారు. తాజాగా గవర్నర్ కోటాలో ఇద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తే.. ఇందులో ఒక బీసీ మహిళ అందునా వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన మహిళకు అవకాశం కల్పించారన్నారు. అది కూడా ఒక సామాన్య కార్యకర్తగా ఉన్న మహిళకు అవకాశం కల్పించారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి అర్బన్ నియోజకవర్గ నేతలంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, రంగా, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, పోతుల లక్ష్మీనరసింహులు, బొమ్మినేని శివ, టిడిపి నాయకులు రంగా, మారుతి కుమార్ గౌడ్, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, అనుబంధ శాఖలపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష

అనంతపురం, ఆగస్టు 19 :( అనంత సూర్య) అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులతో ప్రైమరీ సెక్టార్ పై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత ప్రైమరీ సెక్టార్ సమావేశంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖ అధికారులు తీసుకున్న చర్యలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్-నినో పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే 68 శాతంపైగా పూర్తి కాగా, పూర్తిగా చేపట్టాలన్నారు. జిల్లాలో 502 గ్రామాల పరిధిలో 48,900 ఎకరాల్లో హాఫ్ మూన్ మోడల్ లో పంటల సాగు చేయాల్సి ఉండగా, ఇందులో పురోగతి తక్కువగా ఉందని, మరింత పెంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీలో (ఏపీఎఫ్ఆర్)లో రైతుల రిజిస్ట్రేషన్ మరింత చేపట్టాలన్నారు. హార్టికల్చర్



పంటల పరిధిలో ఈ క్రాప్ బుకింగ్ వచ్చే నెల 15వ తేదీలోపు పూర్తిగా చేపట్టాలని ఆదేశించారు. పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి డిసిఓ పరిధిలో పిఏసిఎస్ లో ఒకటి పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టాలని, ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కెసిసి కార్డులు ఉన్న మస్త్యకారులకు బ్యాంకులలో రుణాలు ఇవ్వడం లేదని, రుణాలు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంకి సూచించారు. ఇందులోభాగంగా ఈ ఖరీఫ్ లో మైనస్ 36 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడం జరిగిందని, జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 3,43,394 హెక్టార్లకు గాను, 1,87,598 హెక్టార్లలో అనగా 55 శాతం మాత్రమే పంటల సాగు చేయడం జరిగిందని, వేరుశెనగ 30 శాతం మాత్రమే సాగు కాగా, కంది 116 శాతం సాగు కావడం జరిగిందని, ఎల్-నినో పరిస్థితుల వల్ల ఐడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు తెలియజేయదం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్, ఎపిఎంఐపి, పశుసంవర్ధక శాఖ, మార్క్ఫెడ్, మార్కెటింగ్, డ్వామా, తదితర శాఖల పరిధిలో ఆయా కార్యక్రమాల ప్రగతి గురించి జాయింట్ కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, పశు సంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డ్వామా పిడి సలీమ్ భాష, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, ఏపీసీఎన్ఎఫ్ ఎస్పీఎం డా.నవీన్, కెవికె శాస్త్రవేత్త మల్లీశ్వరి, జిల్లా సెరికల్చర్ అధికారి మెహతాజి సుల్తాన్, జిల్లా ఫిషరీస్ అధికారి విజయకృష్ణ, మార్కెటింగ్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరలను గుర్తించిన సీఎం చంద్రబాబు



అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య : కూటమి ప్రభుత్వం గవర్నర్ కోటాలో వడ్డెర సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వడ్డెర సంఘం నాయకులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతపురం నగరంలోని వడ్డెర సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచపు వడ్డే వెంకటేశులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వడ్డెర నాయకులు, సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా కుంచపు వడ్డే వెంకటేశులు మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ వడ్డెర సామాజిక వర్గాన్ని గుర్తించి రాజకీయంగా ప్రోత్సహించిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనన్నారు. వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే దిశగా టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెరలకు రాజ్యాధికారం కల్పిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. వడ్డెర జాతి ముద్దుబిడ్డ దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కల్పించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెరల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర సామాజిక వర్గానికి కల్పించిన ఈ రాజకీయ గుర్తింపును స్వాగతిస్తున్నామని, భవిష్యత్తులో వడ్డెరలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ వడ్డెర్ల సంఘం అధ్యక్షులు విఎస్ రాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వడ్డే నాగేంద్ర, నాగరాజు వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణదుర్గం, కోనాపురం నారాయణస్వామి ఉరవకొండ వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు, కొండపల్లి మల్లెల జయరాం, పుట్లూరు వడ్డే మంజుల, కొండన్న రాణినగర్, డేరంగుల గంగరాజు, రామసాగరం వడ్డే ఆదినారాయణ, కొర్రపాడు రామాంజనేయులు, కూడేరు వడ్డే బ్రహ్మయ్య, శ్రీనివాసులు కళ్యాణదుర్గం, గంగాధర్ సెట్టూరు మండలం అధ్యక్షులు, పాలవాయి అనిల్, కో క్లస్టర్, ఈశ్వరయ్య అనంతపురం అర్బన్ స్టోర్ డీలర్, ఎర్రగుంట సురేష్, ఎర్రగుంట హనుమంతప్ప, పెద్దన్న బెలుగుప్ప వడ్డెర అధ్యక్షులు, వడ్డే వెంకటేష్ తగరకుంట యూనియన్ ప్రెసిడెంట్, శ్రీనివాసులు, తగరకుంట గ్రామ కమిటీ మెంబర్ నరేష్ చౌదరి, మహబూబ్ బాషా, వడ్డెర నాయకులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'బద్లావ్ జరూరీ హై-దేశ్ కో బచావో, మోడీ హటావో'

అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య : నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గండాల సంతోష్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా అధ్యక్షుడు ధనుంజయ్ అధ్యక్షతన అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని దేశ యువతకు హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కోట్లాది మంది యువతకు నిరాశే మిగిలిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని అన్నారు. 'ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ, యువతకు ఇచ్చిన ఆ హామీ ఏమైంది.అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కన పెట్టడం సరికాదన్నారు. నారా లోకేష్ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేసి, శాఖల వారీగా ఖాళీలను ప్రకటించి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు, అవకతవకలను అరికట్టి పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీట్ సహా అన్ని పోటీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రులను పీపీపీ విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలను నిలిపివేయాలని కోరారు.




అనంతపురం జిల్లాలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గౌని దుర్గాప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దేవేంద్ర, నగర అధ్యక్ష కార్యదర్శులు,ఆర్గనైజేషన్ కార్యదర్శిలు, కార్యదర్శి రియాజ్ ఖాన్, ఆనంద్, బండారి తేజ, రాంబాబు, ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి నవీన్ బాబు, బికేస్ మండల కార్యదర్శి జిల్లా సహాయ కార్యదర్శి లోకేష్ బండారి, రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు ప్రసాద్, జిల్లా నాయకులు అశోక్, వంశి, షమివుల్లా, గణేష్, ప్రసాద్, అశోక్, హుసేన్, వలి, వర్ధన్, సన్నీ, అనిల్, విష్ణు, గణేష్, సర్మాష్, నాని, అభి, రాప్తాడు నియోజకవర్గ ఉపాధ్యక్షులు బాలాజీ, నరేంద్ర తదితరాలు పాల్గొన్నారు.

# దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి...వడ్డెర్ల హర్షం

అనంతపురం ఆగస్టు 19, అనంత సూర్య : దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కిన సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆమె స్వగృహంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. శ్రీ వెంకటరమణ స్వామి బోర్వెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దళవాయి పెద్ద మారెప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇందుకూరుపల్లి ఉత్తన్న, సీనియర్ నాయకులు వలిపి గంగులప్ప, ఉపాధ్యక్షులు గంగరాజు, గోగుల రామాంజనేయులు, కళ్యాణదుర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు నాగరాజు, సెట్టూరు గంగాధర్, ముదిగళ్ళు శ్రీనివాసులు, పాల్వాయి అనిల్, సీరిపికొట్టాలు శ్రీనివాసులు, పల్లపు రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. చట్టసభల్లో వడ్డెర్ల సమస్యలను బలంగా వినిపిస్తూ సామాజిక వర్గ



అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# జిల్లా సమస్యలు, పార్టీ బలోపేతంపై రాష్ట్ర అధ్యక్షులతో కీలక చర్చ



విశాఖపట్నం, ఆగస్టు 19:( అనంత సూర్య) : బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి అనంతపురం జిల్లాలోని ప్రధాన సమస్యలు, ప్రజా సమస్యలపై చర్చించారు. అలాగే రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది.

# గుత్తా హరికి "కళారత్న" అవార్డు




అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య : జిల్లాకు చెందిన సీనియర్ కవి, రచయిత, సామాజిక కార్యకర్త, పాత్రికేయుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడుకు "కళారత్న" అవార్డు దక్కింది. ప్రముఖ సాంస్కృతిక సంస్థ "వే ఫౌండేషన్" 13వ వార్షికోత్సవం సందర్భంగా తిరుపతి మహతి ఆడిటోరియంలో ఇటీవల అవార్డును ప్రదానం చేశారు. శ్రీనాథ మహాకవి ముని మనవడు, ప్రముఖ శాసన పరిశోధకులు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమ, జడ్పీ ఉప సిఈఓ డాక్టర్ జి. వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. మూడు దశాబ్దాలుగా విద్య, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవ, మీడియా రంగాల్లో గుత్తా హరి విశేష సేవలందిస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షులుగా, ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఆయన పనిచేస్తున్నారు. పలు కవితలు, విమర్శ వ్యాసాలు, వార్తాకథనాలు రాసి ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. గుత్తా హరికి "కళారత్న" అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ఏఐఎస్‌బి రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి



అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య : నెల్లూరు నగరంలో ఈనెల 24, 25 తేదీల్లో జరగనున్న అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బి) రాష్ట్ర ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐఎస్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం నగరంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర ప్లీనరీ సమావేశాల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ విద్యకు రెడ్ కార్పెట్ పరుస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో నెంబర్ 77 ను రద్దు చేసి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తామని లోకేష్ ఇచ్చిన హామీని నేటికి అమలు చేయపోవడం దారుణమన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వారు అన్నారు. సంక్షేమ విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండా ఉండేందుకే విద్యార్థి సంఘాలను హాస్టల్ లోకి అనుమతించబోమని సర్క్యులర్ జారీ చేయడం కూటమి ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని వారన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా, పాఠ్యపుస్తకాలు సరైన సమయానికి అందించకుండా విద్యార్థులు చదువులను ఏవిధంగా కొనసాగించగలరో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను చదువులకు దూరం చేస్తుందన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, వార్డెన్, ప్రొఫెసర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంపు కోసం విద్యార్థుల పక్షాన పోరాటాలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఈనెల 24, 25 తేదీలలో నెల్లూరు నగరంలో నిర్వహించనున్న అఖిల బ్లారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్బి నాయకులు గౌతమ్, ఇంతియాజ్, మనోహర్, మంజు, సాయినాథ్, మహేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

* ఫేక్ కాంట్రాక్టర్లు బాగోతం పోలీస్ స్టేషన్‌కే పరిమితమా ?
* దొంగ రూ.కోట్ల సీ బిల్లులపై దృష్టి సారించని దర్యాప్తు సంస్థలు
* ఎమ్మెల్యే ఆదేశించినా.. జరగని ఆ పనులు
* ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ సెలవులో షాకింగ్ నిజాలేంటి ?
* టిడ్కో డిప్యూటీ ఇంజనీర్‌కు నగరపాలకలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు ఏంటి ?
* ఇంజనీరింగ్ విభాగం పట్టు కోల్పోతున్న కమిషనర్ రావ్
* సమీపిస్తున్న నగర 'పాలక' ఎన్నికల్లో కలిసి వచ్చేది ఎవరికి ?
* ఇదీ నగరపాలక ఇంజనీరింగ్ విభాగంలోని కథాకమానిషా




*అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య :*

అనంతపురం నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో చాప కింద నీరులా అవినీతి, అక్రమాలు ప్రవహిస్తున్నాయి. ఒకరిని మించి మరొకరు.. కొందరు కాంట్రాక్టర్లు, పార్టీలకతీతంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. తక్కువ పని చేసి ఎక్కువ సీ బిల్లుల మాటున డబ్బులు డ్రా చేశారట. ఇదే విషయంపై వారు కాంట్రాక్టర్లే కాదని ఓ కాంట్రాక్టర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు కమిషనర్‌ను, నగరపాలక సూపరింటెండెంట్‌ను ఆదేశించడం తెలిసిందే. అయితే ఈ పంచాయతీ కాస్త తొలిత 40 మంది వరకు కాంట్రాక్టర్లను లిస్టులో పెట్టి వన్ టౌన్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. తర్వాత అందులోని కొందరి పేర్లను తొలగించారు. మిగిలిన వారికి కూడా కాంట్రాక్టర్ సర్టిఫికెట్ తెచ్చుకునేలా.. చేసిన పనులకు బిల్లులు చేసేలా కోర్టుకెళ్లారని సాకు చూపి ఆ బిల్లులు కాస్త 'సందులో సడేమీయ' అన్నట్టుగా చేసేసుకుంటున్నారని తెలిసింది. ఇదేకాదు రూ.కోట్లల్లో సిల్ట్ రిమూవల్ పేరుతో సి బిల్లులు దొంగవి చాలా వరకు చేసుకున్నారని, ఒక ఏడాది కాలంలోనే రూ.9కోట్లకు సి బిల్లులు దాటిపోయాయని సమాచారం. అయితే ఈ బిల్లులకు సంబంధించి దినపత్రికలు కథనాలు రాసినా.. దర్యాప్తు సంస్థలు అటువైపుకు సి బిల్లుల మాటున ఎంత బిల్లులు చేశారన్న దానిపై దృష్టి సారించక పోవడం విశేషం. ఇలా చెప్పుకుంటూ పోతే.. దొంగ కాంట్రాక్టర్లకు సంబంధించి బ్లాక్ లిస్టులో పెట్టాలని సాక్షాత్తు ఎమ్మెల్యే, నగరపాలక ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా.. ఆ దిశగా అడుగులు వేయకపోవడం, అవినీతి ఎక్కడ బయట పడుతుందోనని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ అకస్మాత్తుగా సెలవులోకి వెళ్లి తిరిగి రాకపోవడం, ఎందరో నగరపాలకలో సీనియర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉన్నప్పటికీ టిడ్కోలో ఉన్న డిప్యూటీ ఇంజనీర్, నగర పాలకలో ఇన్చార్జిగా పని చేస్తున్న వ్యక్తికి నగరపాలక సంస్థలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఇన్చార్జి ఇవ్వడం, ఈమెతోపాటు పలువురు సచివాలయలలోని ఏమినిటిలకు ఇన్చార్జ్ ఏఈలుగా అవకాశం కల్పించి నిజమైన ఏఈల కంట్రోల్లో లేకుండా స్వతంత్రంగా ఉంచడంతో అవినీతికి అవకాశం కల్పించారని తెలుస్తోంది. పనుల విషయంలో అర్బన్ ఎమ్మెల్యే.. ఫలానా కాంట్రాక్టర్ ఫలానా పార్టీ అని సంబంధం లేకుండా పూర్తిగా పగ్గాలు సడలించడంతో నగరంలో పలుచోట్ల నాశిరకం పనులు జరుగుతూ, కూటమి పార్టీకి నష్టం చేకూర్చేలా కొందరు కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇదే విషయంపై ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ వ్యవహారం ఎలా ఉందంటే.. **'ఆట కదరా రాజా'** అన్నట్లుగా **'ఆయన మాత్రం మంచోడు.. ఎందుకు చేయి చాచాడు'** అని బయటకి ప్రచారం జరుగుతున్నా.. ఆ ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి మాత్రం ఆగడం లేదని తెలుస్తుంది. ఈ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన మరింత సమాచారం మరికొన్ని కథనాల్లో **'అనంత సూర్య'** వివరించే ప్రయత్నం చేస్తుంది.

# థాంక్యూ సర్..

సీఎం చంద్రబాబుకు.. ఎమ్మెల్యే దగ్గుపాటి, నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి కృతజ్ఞతలు

## ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా కలిసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ





*అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య :*

ఒక సామాన్య క్లస్టర్ ఇంచార్జ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రమాదేవిని ఎమ్మెల్సీగా ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రమాదేవి దంపతులు.. ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా కలిశారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రమాదేవితో పాటు ఆమె భర్త టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అనంతపురం నియోజకవర్గంలోని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు.. ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లాలో ప్రజాప్రతినిధులు అందరితో కలిసి సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రమాదేవికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు వస్తాయని చెప్పడానికి ఇదొక నిదర్శనమన్నారు. ఒక సామాన్య బీసీ మహిళకు ఎమ్మెల్సీ పదవి రావడమన్నది చిన్న విషయం కాదని, తెలుగుదేశం పార్టీతోనే ఇది సాధ్యమన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళలకు ఎమ్మెల్సీ అవకాశం అందించడంపై సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు నూతన ఎమ్మెల్సీ రమాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా పని చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి కచ్చితంగా న్యాయం చేస్తానని ఆమె తెలిపారు.

# విద్యార్థినీలతో చీపుర్లు పట్టించిన టీచర్లు





*అనంతపురం, ఆగస్టు 19 అనంత సూర్య :*

* చెత్త ఊడవాల్సింది వారుకాక.. మేము చేయలా !
* నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన ఉపాధ్యాయులు

పుస్తకాలు పట్టాల్సిన చేతులకు చీపుర్లు అందించారు. స్లీపర్‌లు చేయాల్సిన పనిని విద్యార్థులతో చేయిస్తూ.. విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తున్నారు. అనంతపురం న్యూ టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినీలతో చెత్త ఊడిపించడంతోపాటు, ఇతర పనులు చేయిస్తున్నారు. విద్యార్థుల చేత ఇలాంటి పనులు చేయించడం ఏమిటని పాత్రికేయులు ప్రశ్నించగా.. వాళ్లు కాక మేమేమైనా చెత్త ఊడవాలా అంటూ నిర్లక్ష్య సమాధానం చెప్పడం వీళ్ళ అహంకారానికి నిదర్శనంగా నిలుస్తుంది. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి దుస్థితి నెలకొనడంతో విద్యార్థినిల తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను చదువుల కోసం స్కూళ్లకు పంపిస్తే.. స్కూళ్లలో పని చేయిస్తారా.. అంటూ మండిపడుతున్నారు. విద్యార్థులతో చెత్త ఊడిపిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి



విజయనగరం అనంత సూర్య ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సెక్రటరీ మల్లిఖార్జున ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు అధికారులతో బుధవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ పంచాయతీలు మండల పరిషత్తులు జిల్లా పరిషత్తులు మున్సిపాలిటీలు కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా వివరాలు రిజర్వేషన్లు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు విద్యుత్ మరుగుదొడ్లు ర్యాంపులు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అర్బన్ లోకల్ బాడీస్ జెడ్పీటీసీ ఎంపీటీసీ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ పోలింగ్ కౌంటింగ్ ప్రక్రియలపై అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల గుర్తింపు సిబ్బంది నియామకం వసతుల కల్పనను కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు లవరాజు మల్లిఖార్జునరావు బాలస్వామి పాల్గొన్నారు.

# ఎస్సీలకు టీడీపీలో పెద్దపీట.. వర్ల రామయ్యకు ఎమ్మెల్సీగా అవకాశం

అనంత సూర్య, 19: అనంతపురం: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వర్ల రామయ్యను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం పట్ల హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ముందుగా వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని ముత్యాలప్ప పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి, అన్ని వర్గాల అభ్యున్నతికి టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వర్ల రామయ్యకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ఇందుకు నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో కూడా తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని, చంద్రబాబు నాయుడు



నాయకత్వంలో టీడీపీ మరోసారి రాష్ట్రాన్ని సమ-ర్థవంతంగా పరిపాలిస్తుందని ముత్యాలప్ప ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎమ్మెల్సీగా ఎంపికైన వర్ల రామయ్యకు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

# అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు



విజయనగరం అనంత సూర్య ప్రతినిధి: పశుసంవర్ధక శాఖ అధికారులపై అసత్య ఆరోపణలు దూషణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. జంతు సంక్షేమ సంఘంలో స్థానం కల్పించలేదనే కక్షతో లోగిస రామకృష్ణ అతని అనుచరులు తమపై బెదిరింపులకు పాల్పడుతూ అవమానిస్తున్నారని పశుసంవర్ధక శాఖ అధికారులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ డైరెక్టర్ మన్మధరావుపై వ్యక్తిగత దూషణలు చేశారని వినతిపత్రం అందజేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మొదటి పట్టణ పోలీసులను ఆదేశించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405